

### దళితబంధు ద్వారా నెలకు రూ.25 వేలు సంపాదిస్తున్నా..

నేను ఎంఏ(ఇంగ్లిష్) చదివా. టీటీసీ కూడా చేశా. గతంలో డీఎస్సీ రాశా. నాలుగు మార్కులతో టీచర్ ఉద్యోగం కోల్పోయా. మా అమ్మ పేరిట ఉన్న 75 సెంట్ల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకునిగా పని చేశా. ఉద్యోగం వదిలి ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నా. కేసీఆర్ దయవల్ల నాకు దళితబంధు ద్వారా రూ.10 లక్షల యూనిట్ మంజూరైంది. ఈ డబ్బులతో మా మండల కేంద్రం బెజ్జూర్‌లో హార్డ్‌వేర్ కం ఎలక్ట్రికల్ షాపు పెట్టుకున్నా. షాపు పెట్టినప్పటికి గిరాకీ మంచిగా అవుతోంది. ఇక నేను ప్రభుత్వ ఉద్యోగానికి ఎదురు చూడాల్సిన అవసరం లేదు. దళితబంధుతో పెట్టుకున్న దుకాణంతో నెలకు కనీసం రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు సంపాదిస్తున్నా. రాబోయే రోజుల్లో వ్యాపారాన్ని విస్తరించుకునే ఆలోచన ఉంది. సీఎం కేసీఆర్ దళితబంధు రూపంలో నాకు ఉద్యోగం కల్పించినట్లుగానే భావిస్తున్నా.

**- దుర్గం రవీందర్, దళితబంధు లబ్ధిదారు, బెజ్జూర్.**

# ఇంటింటికీ సంక్షేమం

- పదేళ్లలో వెల్లివిరిసిన పల్లెలు
- గడప గడపకూ లబ్ధిదారులు
- అభాగ్యులకు ఆసరా.. వ్యాధిగ్రస్తులకు సీఎంఆర్‌ఎఫ్..
- పేదింట్లో కల్యాణ కాంతులు.. గొల్ల కుర్మలకు సబ్సిడీ గొర్రెలు..

**బీఆర్‌ఎస్ పాలనలో** సంక్షేమ పథకాలు గడప గడపకూ చేరాయి. అభాగ్యులకు 'ఆసరా' అవుతుండగా.. గొల్ల కుర్మలకు సబ్సిడీ గొర్రెలతో ఉపాధి దొరుకుతోంది. పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లకు కల్యాణలక్ష్మితో కల్యాణకాంతులు నిండుతున్నాయి. అన్నదాతలకు రుణమాఫీ మొదలుకొని రైతుబంధు, రైతుబీమా వంటి పథకాల వరకు ప్రతి గ్రామంలోని ప్రతి ఇంట్లో అన్నదాతలకు కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు పలకరిస్తూనే ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పల్లెబాట పట్టిన బీఆర్‌ఎస్ అభ్యర్థులు కోవ లక్ష్మి, కోనేరు కోనప్ప ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రచారం చేస్తున్నారు. పదేళ్ల కాలంలో గణనీయమైన ప్రగతి సాధించామని వివరిస్తున్నారు.

**- కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ)**

### ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందిన లబ్ధిదారులు..

| పథకం | లబ్ధిదారులు | నిధులు |
|---|---|---|
| ఆసరా పింఛన్‌లు | 56,416 | రూ.12.96 కోట్లు (ప్రతి నెల) |
| కల్యాణలక్ష్మి(షాదీ ముబారక్) | 21,412 | రూ.195.92 కోట్లు |
| కేసీఆర్ కిట్స్ | 15,190 | రూ.19.79 లక్షలు |
| సబ్సిడీ గొర్రెలు | 2,902 | రూ.36.27 కోట్లు |
| రైతుబంధు | 1,32,360 | రూ.1,768 కోట్లు |
| రైతుబీమా | 1,943 | రూ.97.15 కోట్లు |
| రుణమాఫీ | 58,354 | రూ.210.96 కోట్లు |
| ట్రాక్టర్ల పంపిణీ | 195 | రూ.9.42 కోట్లు |
| దళితబంధు | 177 | రూ.17.70 కోట్లు |

### ఉద్యోగం వచ్చినట్టుగానే భావిస్తున్నా..



ప్రభుత్వం అందించిన దళితబంధు పథకంతో నేను ప్రారంభించిన బిజినెస్‌ని నేను ఉద్యోగం పొందిన విధంగానే భావిస్తున్నా. నేను ఎంబీఏ చదువుకున్నా. కొంతకాలం హైదరాబాద్‌లోని మార్కెటింగ్ ఫీల్డులో పనిచేశా. నెలకు రూ.24 వేల వేతం ఇచ్చేవారు. మా అమ్మ అనారోగ్య కారణాల దృష్ట్యా నేను ఆ ప్రైవేటు ఉద్యోగాన్ని మానేశా. ప్రభుత్వం దళితబంధు కింద రూ.10 లక్షలు అందించింది. ఈ డబ్బులతో ఫ్లెక్సీ ప్రింటింగ్ యూనిట్ పెట్టా. దళితబంధు రూపంలో సీఎం కేసీఆర్ నిరుద్యోగులకు మంచి ఉపాధిని కల్పిస్తున్నారు. నేను ఉద్యోగానికి వేచి చూడాల్సిన పనిలేదు. వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొని ప్రభుత్వ ఉద్యోగం కంటే అధిక డబ్బులు సంపాదిస్తా.

**- దుర్గం శ్రీకాంత్, పులికుంట, రెబ్బన మండలం.**

### అప్పులు చేయాల్సిన బాధ తప్పింది..



నాకు రెండెకరాల భూమి ఉన్నది. ఎక్కడా లేని విధంగా రైతుబంధు, రైతుబీమా ప్రవేశపెట్టి పండిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు రాష్ట్ర సర్కారు కొంటున్నది. నాకు యేటా రెండెకరాల భూమికి రూ.20 వేలు అందుతున్నవి. ఈ డబ్బులను సాగుకు పెట్టుబడిగా పెడుతున్న. గతంలో అప్పులు చేసి సాగు చేసేవాడిని. గిప్పుడు రైతుబంధు ఇస్తుండడంతో అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా పోయింది. పెట్టుబడి సాయం అందిస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటా.

**- నగేశ్, రైతు, పెంచికల్‌పేట్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా.**

### విద్యుత్ పరికరాలు వాడుతున్నాం..



మారుతున్న కాలానికి అనుగుణంగా కటింగ్ షాపుల నిర్వహణలోనూ మార్పులు వచ్చాయి. మాకు కరెంటు బిల్లు నెలకు 400-500 వరకు వస్తోంది. ప్రభుత్వం 250 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వడంతో మాపై విద్యుత్ భారం తగ్గింది. గతంలో కత్తెర, కత్తితో మాత్రమే కటింగ్, గడ్డాలు తీసేవాళ్లం. ఇప్పుడు కటింగ్‌లో కొత్త విధానాలు వచ్చాయి. దీంతో సాంకేతిక విధానాలను అవలంబించాల్సి వస్తోంది. దీంతో కటింగ్ దుకాణాల్లో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. సీఎం కేసీఆర్ మాకు ఉచిత విద్యుత్ ఇచ్చి మాపై ఆర్థిక భారాన్ని తగ్గించారు. చేతివృత్తులపై ఆధారపడే వారికి రాయితీలు కల్పిస్తున్నారు.

**- రజనీకాంత్, కటింగ్‌షాపు, ఆసిఫాబాద్.**


### బొగ్గు ఖర్చు తగ్గింది..



ప్రభుత్వం 250 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వడంతో మాపై కరెంటు భారం తగ్గింది. ఇస్త్రీ చేయడానికి చాలా కరెంటు అవసరమవుతోంది. గతంలో బొగ్గుల ఇస్త్రీ పెట్టెలను వాడేవాళ్లం. బొగ్గులకు బాగా ఖర్చు వచ్చేది. ప్రభుత్వం మాకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తుండడంతో మేము కూడా ఇస్త్రీ మిషన్‌ను వాడే అవకాశం కలిగింది. మాకు ఆర్థిక భారంతోపాటు శ్రమ కూడా తగ్గింది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

**- లచ్చన్న, ఇస్త్రీ షాపు, ఆసిఫాబాద్.**

### ఎవుసానికి సౌలత్ అయింది..



నాకు మూడున్నరెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. యాసంగి రైతుబంధు డబ్బులు గత నెలలో నా అకౌంట్‌లో పడ్డాయి. ఆ డబ్బులతో యాసంగి ఎవుసం పనులు చేసిన. కేసీఆర్ సారు రైతుబంధు పథకం పెట్టి పెట్టుబడి సాయం ఇస్తుండడం వల్ల బాగా లాభం అవుతున్నది. మునుపు ఎవుసానికి ముందే షావుకార్ల దగ్గరికి వెళ్లి వడ్డీకి పైసలు తెచ్చుకునేది. పండిన పంటలో ఎక్కువ పైసలు షావుకార్లకే పోయేవి. కానీ.. గిప్పుడు షావుకార్లకు పోకుండా పండించిన పంట ఫలితం మొత్తం రైతుకే దక్కేటట్లు కేసీఆర్ సారు చేసిండు. గిట్ల రైతులను సంతోష పెడుతున్న గా సారు చల్లగా ఉండాలి.

**- గుర్నులే పోశయ్య, రైతు, కుశ్నపల్లి.**



# ఆరోగ్య శ్రీ రూ.15 లక్షలు



## 'కేసీఆర్ ఆరోగ్య రక్ష' పేరిట గరిష్ఠ పరిమితిని పెంచిన సర్కారు

- అందరికీ ఆరోగ్య భీమా కల్పించాలనేదే సీఎం కేసీఆర్ ధ్యేయం
- బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో పేర్కొనడంపై హర్షాతిరేకాలు

ఆదిలాబాద్, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ) : ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నది. సర్కారు దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది నియామకంతోపాటు అవసరమైన మందులను అందుబాటులోకి తీసుకొచ్చింది. వైద్యం అందించడంలో రోగ నిర్ధారణ పరీక్షలకు టీ-డయాగ్నొస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేసి 52 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నది. వీటితోపాటు ప్రభుత్వాసుపత్రుల్లో రేడియాలజీ ల్యాబ్‌లో ఖరీదైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కరోనా లాంటి వ్యాధులకు వైద్యం అందుతున్నది. ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవల ఫలితంగా ప్రసవాల సంఖ్య బాగా పెరిగింది. బస్తీ, పల్లె దవాఖానల ద్వారా పేదల ఇంటి ముందు వైద్య సేవలు అందుతున్నాయి. జిల్లాకో మెడికల కళాశాల ఏర్పాటుతో ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందుతున్నాయి. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో వైద్య కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

### ఆరోగ్య రక్ష సాయం రూ.15 లక్షలు

ఉమ్మడి రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ సేవలు పేదలకు సరిగా అందేవి కావు. కార్పొరేట్ దవాఖానల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి ఆరోగ్యశ్రీ బీమా గరిష్ఠ పరిమితిని ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచింది. సర్కారు అందిస్తున్న డబ్బులతో పేదలు హైదరాబాద్ పట్టణాల్లోని కార్పొరేట్ వైద్యశాలల్లో ఉచితంగా వైద్యం అందుతున్నది. ఇప్పుడు ఆ వైద్యసేవల సాయాన్ని ప్రభుత్వం భారీగా పెంచింది. 'కేసీఆర్ ఆరోగ్య రక్ష' పేరిట ఆరోగ్యశ్రీ బీమా పరిమితిని రూ.15 లక్షలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించారు. ఆరోగ్య రక్ష పథకంలో భాగంగా అర్హులైన పేదలందరికీ ఈ పథకాన్ని వర్తింప చేస్తారు. ఆరోగ్యశ్రీ సాయం పెంచడంపై పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### వైద్య సేవలే ముఖ్యం



కుభీర్, అక్టోబర్ 25: పేదోళ్లు పెద్ద పెద్ద దవాఖానల్లో వైద్యం చేయించుకోవాలంటే మస్తు ఖర్చయితది. అసలు దవాఖాన్ల దిక్కే పోవద్దు అని ఉంటది. కానీ.. రోగమొస్తే ఏం చేస్తం. ఇగ పెద్ద దవాఖాన్ల చేరితే చేతుల పైసలు ఖాళీ అయితయ్. గిప్పుడు గులాబీ పార్టీవోళ్లు ఆరోగ్య శ్రీ పరిధి పెంచుతమని మాట ఇచ్చిన్రు. రూ. 15 లక్షలతో పేదల ఆరోగ్యానికి రక్ష ఇస్తమంటున్నరు. గిదయితే పేదోళ్లకు ఎంతో మేలయితది. ఇగ దవాఖానకు పోతే పరేషాన్ అవసరం లేదు. ఏదేమైనా దవాఖానల్ల ఇయ్యాల రేపు బిల్లులు చూస్తుంటే పాణం పోయినంత పనవుతున్నది. గిప్పుడు ఆరోగ్యరక్షతోనే అండగా నిలిస్తే పేదోళ్లకు ఎంతో ఇబ్బంది తగ్గుతది. సీఎం కేసీఆర్ సారు మంచి నిర్ణయం తీసుకున్నరు. పేదోళ్లకు ఏం చేసినా ఆయనతోనే అయితది.

**- కచ్చకాయల శ్రీనివాస్, మాలేగావ్**

### ఆరోగ్యశ్రీ పరిధి పెంచితే మేలు



కోటపల్లి, అక్టోబర్ 25: రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు ప్రారంభమయ్యాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా మునుపటి ప్రభుత్వాల కంటే ఎక్కువ స్థాయిలో మెరుగైన ఆరోగ్య సేవలందిస్తున్నది. ఇప్పుడు ఆరోగ్య శ్రీ పరిమితి రూ.5లక్షలు ఉండగా, రూ.15లక్షలకు పెంచుతామని చెప్పడం చాలా సంతోషాన్నిచ్చింది. పేదోళ్లకు ఇది చల్లనైన మాట. ఇగ దవాఖాన్లకు పోతే ఇబ్బందులు తప్పవు. ప్రభుత్వం వైద్య రంగంపై ప్రధాన దృష్టి పెట్టి ఎంతో చేసింది. కేసీఆర్ ఆరోగ్య రక్ష కూడా పేదలకు మెరుగైన వైద్యం అందించి రానున్న రోజుల్లో దేశానికే ఆదర్శంగా నిలవనుంది.

**-ఆసరెల్లి నూతన్, దేవులవాడ, (కోటపల్లి)**

### సంపూర్ణ ఆరోగ్యానికి కృషి



నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 25 : ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పేద కుటుంబాల్లో జబ్బు చేస్తే దవాఖానల్లో ఖర్చు పెట్టలేని పరిస్థితి ఉంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న వారు ఇక దవాఖానలకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఆరోగ్య శ్రీని మరింత పెంచేందుకు నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉంది. రూ.15 లక్షలు ఇస్తమని ప్రకటించడం హర్షణీయం. ఇది పేద ప్రజలకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుంది.

**-జాన భాగ్యలక్ష్మి, నిర్మల్**

### మ్యానిఫెస్టోలో పెట్టడం హర్షణీయం..



నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 25: సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆరోగ్య శ్రీ పరిధిని రూ. 15 లక్షలకు పెంచుతామని ప్రకటించడం హర్షణీయం. ఇది ఎంతో మంది పేదోళ్లకు మంచి చేస్తది. ఇప్పటికే ప్రభుత్వం ప్రజల కోసం ఎంతో చేస్తున్నది. గతంలో పెద్ద రోగం వస్తే వ్యాధి నయం చేసుకోవడానికి ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. పేదలకు కనీస వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నరు. ఇప్పటికైతే ఎన్నో కుటుంబాలను సీఎంఆర్‌ఎఫ్‌తో కొంత ఆదుకున్నరు. ఇగ ఆరోగ్య శ్రీ పరిమితి పెంచితే అందరికీ లాభమైతది.

**-అరకల స్వప్న, మాటేగాం**

### పేదోళ్లకు మేలైతది..



లక్ష్మణచాంద, అక్టోబర్ 25: పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఏం చేసినా అది పెద్ద మేలైతది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్యరక్ష ద్వారా అండగా నిలుస్తామని మ్యానిఫెస్టోలో పెట్టడం బాగుంది. రూ.15 లక్షలకు పెంచుతమని చెప్పడం అభినందనీయం. పేదలకు మంచి వైద్యానికి ఇది పెద్ద భీమా. కచ్చితంగా సీఎం కేసీఆర్ ఇది నెరవేరుస్తరు. పేదోళ్లకు మంచిజేసుడు ఆయనతోనే అయితది.

**-గడికొప్పుల ముత్తన్న, పీచర**

### ఆరోగ్య రక్ష.. పేదలకు వరం..



జైనథ్, అక్టోబర్ 25 : పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నది. అయితే ఇప్పుడు ఆరోగ్య శ్రీ పరిమితిని కూడా పెంచేందుకు బీఆర్‌ఎస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో పెట్టింది. ఈ ఎన్నికల్లో గెలిస్తే తప్పకుండా అమలు చేస్తమని సీఎం కేసీఆర్ చెబుతున్నరు. ఈ పథకం ప్రకారం ఆరోగ్య శ్రీ కింద రూ.15 లక్షల వరకు వైద్యం చేయించుకునే వీలుంటుంది. గిట్లయితే పేదోళ్లకు మంచి జరుగుతది. గతంలో గింత మంచి పథకాలే లేవు. బీఆర్‌ఎస్ అచ్చినంకనే పేదోళ్లకు మంచి జరుగుతున్నది. ఆరోగ్య రక్ష పథకమైతే ఇగ పేదోళ్లకు ఎంతో మంచి చేస్తది.

**- ఏల్టి భూమారెడ్డి, కాప్రిగ్రామం.**

### గరీబోళ్లకు ఊపిరి..



ముమ్మాటికీ తెలంగాణ సర్కారు గరీబోళ్ల సర్కారు. గతంలో బీమార్లు వస్తే వ్యాధి నయం చేయలేక చేతిలో చిల్లి గవ్వలేక ఎంతో తిప్పల పడేది. గిప్పుడు ఏ బీమారి వచ్చినా దవాఖానల వైద్యం చేసుకునే సౌలతులు ఉన్నయ్. పెద్ద పెద్ద దవాఖానల్లో కూడా వైద్యం చేయించుకునేందుకు ఆరోగ్య శ్రీ ఎంతో ఉపయోగపడతది. గిప్పుడు ఆరోగ్య శ్రీ పరిమితిని కూడా పెంచుతమని కేసీఆర్ సారు చెబుతున్నరు. మళ్లా గెలిస్తే కచ్చితంగా చేస్తమంటున్నరు. మ్యానిఫెస్టోలో పెట్టినట్లు రూ. 15 లక్షలు చేస్తే పేదోళ్లందరికీ ఎంతో మేలయితది. ఇది నిజంగా గరీబోళ్లకు ఊపిరి నింపుతది.

**- కన్నజీ పండరి, కాప్రిగ్రామం**



చెన్నూర్ పట్టణంలో నిర్మించిన 50పడుకల దవాఖాను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు, విప్ బాల్క సుమన్, ఎంపీ వెంకటేశ్ నేతకాని, మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ (ఫైల్)

# చెన్నూర్‌లో ప్రచార జోరు

- దూసుకెళ్తున్న బీఆర్‌ఎస్
- శ్రేణులతో కలిసి నడుస్తున్న విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్
- ప్రత్యేక సమావేశాల్లో గెలుపు వ్యూహాలపై చర్చ
- కార్యకర్తలకు దిశానిర్దేశం
- ఇప్పటికే మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పర్యటన
- గ్రామాల్లో గులాబీ నేతలకు బ్రహ్మరథం

చెన్నూర్, అక్టోబర్ 25: చెన్నూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నది. ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బాల్క సుమన్ నియోజకవర్గం నుంచి రెండోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ఈసారి కూడా భారీ విజయం సాధించేందుకు శ్రేణులతో కలిసి గెలుపు వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తూ గెలుపుపై దిశానిర్దేశం చేస్తున్నారు.

### ఇప్పటికే ఎన్నికల ప్రచారం షురూ..

**ఆగస్టు 26న:** ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు జైపూర్ మండలంలోని ఇందారం వద్ద ప్రజలు, బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుండి చెన్నూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు.

**సెప్టెంబర్ 4న:** మందమర్రి పట్టణానికి వచ్చిన ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు అక్కడి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి, పట్టణంలోని పుర వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు.

**సెప్టెంబర్ 7న:** మంచిర్యాలలోని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌తో కలసి ప్రభుత్వ విప్ బాల్క సుమన్ నియోజకవర్గ స్థాయి ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో అనుచరించాల్సిన వ్యూహాలను వివరించారు.

**సెప్టెంబర్ 9న:** క్యాతన్‌పల్లిలోని తన స్వగృహంలో క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో, మందమర్రి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మందమర్రి మున్సిపాలిటీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన పద్ధతులపై దిశా నిర్దేశం చేశారు.

**అక్టోబర్ 1న :** బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలకు ఆహ్వానించి పెద్ద ఎత్తున చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం మందమర్రి పట్టణంలో నిర్వహించిన రోడ్ షోలో, క్యాతన్‌పల్లిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేపట్టిన పలు ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం తపించే బాల్క సుమన్‌ను భారీ మెజార్టీతో మరో సారి గెలిపించాలని ఆయన కోరారు.

**అక్టోబర్ 7న:** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును చెన్నూర్‌కు ఆహ్వానించి పెద్ద ఎత్తున చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం చెన్నూర్‌లో నిర్వహించిన భారీ రోడ్‌షోలో మంత్రి హరీశ్‌రావు ప్రసంగించి సీఎం కేసీఆర్ చేపట్టిన పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించి, బాల్క సుమన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**అక్టోబర్ 13న:** మందమర్రి పట్టణంతో పాటు కోటపల్లి, చెన్నూర్ మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 14న: క్యాతన్‌పల్లిమున్సిపాలిటీ, జైపూర్, భీమారం మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆయా చోట్ల సమావేశం నిర్వహించి ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు.



మందమర్రి మండలంలో ఆయిల్ పాం ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్, విప్ బాల్క సుమన్ (ఫైల్)

**అక్టోబర్ 17న:** క్యాతన్‌పల్లిలోని ఎంఎన్‌ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్‌తో సమావేశం నిర్వహించి రానున్న ఎన్నికల్లో సోషల్ మీడియా వినియోగంపై దిశా నిర్దేశం చేశారు. ఇలా ఎన్నికల్లో ప్రచారం కోసం ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్‌ను మున్సిపాలిటీల వారీగా గ్రామాల వారీగా సిద్ధం చేశారు. దీంతో అన్ని పార్టీల కంటే ముందుగానే తమ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇప్పటికే ప్రచార వాహనాలను ప్రారంభించడంతో, అట్టి వాహనాలు పట్టణాలు, గ్రామాలు తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేపట్టిన పలు ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పాటల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఇప్పటి వరకు చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేస్తూ, తిరిగి అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పార్టీ మ్యానిఫెస్టోను వివరిస్తున్నారు. ఇలా ప్రచారంలో అన్ని పార్టీల కంటే ముందుగా నియోజవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ దూసుకపోతున్నది.